క్లుప్తంగా

ఘనంగా బోనాల పండగ



తలుపులమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

కోటవురట్ల : తంగేడు గ్రామంలో సోమవారం బోనాల పండగను ఘనంగా జరుపుకొన్నారు. గ్రామస్తులంతా భారీ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించి పూజలు చేశారు. ఏటా తలుపులమ్మ తల్లి వెలసిన రోజున బోనాలు సమర్పించడం ఆన వాయితీ అని వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీన రసింహరాజు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్ పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటుకు భూమిపూజ



మునగపాకలో తాగునీటి బోరుకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక : మునగపాకలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. మునగపాకలో నూతనంగా ఏర్పాటు చేయనున్న మంచినీటి బోరుకు ఆయన మంగళవారం భూమి పూజ చేశారు. ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కనకలక్ష్మి అప్పారావు, ఎంపీటీసీలు రాము, గణేష్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, వార్డు సభ్యులు షకిరమనాయుడు, సోమరాజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి



బీజామృతంతో రైతులతో విత్తన శుద్ధి చేయిస్తున్న సిబ్బంది

పాయకరావుపేట : రైతులు వేసే పంటలకు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు సూచించారు. మండలంలో శ్రీరాంపురం, పెదరాంభద్రపురం గ్రామాల్లో రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి ద్వారా తెగుళ్ళు నియంత్రించవచ్చునన్నారు. మొలక శాతం పెరుగుతుందన్నారు. బీజామృతంతో రైతులు తప్పనిసరిగా విత్తనాలను శుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పలనాయుడు, ఆర్‌బీకే వీఏఏ వీరబాబు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం



ఒంపోలులో సంపదతయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి నాగలక్ష్మి

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని తడిపొడి చెత్త తయారీ కేంద్రాల జిల్లా అధికారి నాగలక్ష్మి పేర్కొన్నారు. ఒంపోలు సంపద తయారీ కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. తడిపొడి చెత్త వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, కేంద్రాల ద్వారా ఎరువులను తయారు చేసి విక్రయాలు జరిగేలా చూడాలని ఈ సందర్భంగా ఆమె ఆదేశించారు. ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట : గవర్నమెంట్ ఐటీఐ పాయకరావుపేటలో 2023–24 సంవత్సరంలో అడ్మిషన్ల కోసం (రెండవ విడత) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువ పత్రాలతో ఐటిఐ.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో జూలై 31 వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు గవర్నమెంట్ ఐటీఐ పాయకరావుపేటలో రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఎస్ఎస్‌సి, కుల ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఈమెయిల్ ఐడీ, ఆధార్ కార్డ్ సమర్పించాలి. ఆగస్టు 3న కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.

తప్పుడు కూతలపై చర్యలు తీసుకోండి

- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై కొనసాగుతున్న నిరసనలు
- వాడవాడలా వలంటీర్ల ఆగ్రహజ్వాలలు
- పోలీసులకు ఫిర్యాదులు



పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ఎస్.రాయవరంలో నిరసన తెలుపుతున్న వలంటీర్లు



పవన్ కళ్యాణ్‌పై కేసు నమోదు చేయాలని సీఐకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు

ఎస్.రాయవరం : నిత్యం ప్రజా సేవలో ఉన్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఎస్.రాయవరం మండలంలో 28 గ్రామాల వలంటీర్లు అడ్డురోడ్డు జంక్షన్‌కు చేరుకుని మంగళవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం రూ.5 వేలు తీసుకుని సేవా దృక్పథంతో పని చేస్తుంటే నిరాధార ఆరోపణలు చేయడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్లుగా తక్కువ వేతనాలకు పని చేస్తుంటే మీకెందుకు అంత చులకనా అని దుయ్యబట్టారు. కరోనా కష్ట కాలంలో మేము ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించి సేవలందిస్తే మీకు మా శ్రమ కనపడకపోగా, మా నిందలు వేస్తారా..వలంటీర్‌గా 60 శాతం మహిళలమే ఉన్నాం. మేము మహిళల వివరాలు నిఘా వర్గాలకు ఇస్తున్నామని ఎలా చెప్పాలనిపించిందని విమర్శించారు. పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ రాష్ట్రానికి మంచి చేస్తానని చెబుతూ అక్కచెల్లెళ్ల వంటి వలంటీర్లను విమర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. వలంటీర్ల పట్ల అసత్య ఆరోపణలు చేసిన పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పాత జాతీయ రహదారి కూడలి వద్ద మానవ హారం నిర్వహించారు. ర్యాలీగా నక్కపల్లి సర్కిల్ కార్యాలయానికి వెళ్లి సీఐ నారాయణరావు ఫిర్యాదు ఇచ్చారు. ఈ ఆందోళనలో పాల్గొన్న వారిలో నానేపల్లి అప్పలరాజు, చేపల రాజు, వరలక్ష్మి,భవాని, నూకతర్నం తదితరులు ఉన్నారు.

మునగపాకలో ర్యాలీ, మానవహారం

మునగపాక : ప్రజలకు నిస్వార్థమైన సేవలందిస్తున్న వలంటీర్లపై జనసేన నేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం మునగపాకలో వలంటీర్లు ఆందోళన నిర్వహించారు. వారికి సంఘీభావంగా పార్టీ శ్రేణులు మద్దతుగా నిలిచాయి. మునగపాక పార్టీ కార్యాలయం నుంచి వలంటీర్లు, పార్టీ శ్రేణులు ర్యాలీగా మునగపాక మెయిన్‌రోడ్డుకు చేరుకొని మానవహారం నిర్వహించారు. అక్కడ నుంచి స్థానిక పోలీసుస్టేషన్‌కు చేరుకొని పవన్‌కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఎస్‌ఐ మన్మథరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎంతోమంది మేధావులు ప్రసంసిస్తున్నారని, అటువంటి వలంటీర్లపై పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సంక్షేమ పథకాల మంజూరులో అవినీతికి తావులేకుండా పారదర్శకంగా అందిస్తున్న వలంటీర్‌లను అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. కరోనా కష్టకాలంలో సేవలందించిన వలంటీర్లను విమర్శించిన పవన్‌కల్యాణ్ తక్షణమే బేషరతుగా క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు బొజా లక్ష్మి శ్రీనివాసరావు, చిందాడ దేవి, మండల మహిళా నేత శీరా రమణమ్మ, బీసీ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల జగన్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు ఎంపీటీసీలు రాము, గణేష్, పార్టీ నేతలు నూకరాజు, శ్రీనివాసరావు, మహేష్, బొడ్డేడ బుజ్జి, మందా రాము, సూరిశెట్టి రామకృష్ణ, వలంటీర్లు పాల్గొన్నారు.



పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా మునగపాక పోలీసుస్టేషన్‌కు ర్యాలీగా వస్తున్న వలంటీర్లు



మునగపాక ఏఎస్‌ఐ మన్మథరావుకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు



వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

నిస్వార్థ సేవకు చిరునామా..వలంటీర్

ఓ మహోన్నత ఆశయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. సేవా భావాన్ని ప్రదర్శిస్తూ ఎందరో లబ్ధిదారులకు వలంటీర్లు అండగా నిలుస్తున్నారు. ఏ సమస్య ఉన్నా మేమున్నామంటూ భరోసానిస్తున్నారు. కోవిడ్ సమయంలో రోగులకు ఆత్మీయులు, కన్నవాళ్లు సైతం దగ్గర కెళ్లేందుకు భయపడిన సమయంలోనూ తమ ప్రాణాలను ఫణంగా పెట్టి వారికి సేవలందించిన వలంటీర్లు ఎందరో ఉన్నారు. వలంటీరు అంటే ఓ నిబద్ధత..ఓ లక్ష్యం..ఓ భరోసా అని రుజువు చేస్తున్నారు.

కోటవురట్ల: క్రమం తప్పకుండా ఒకటో తేదీనే పాలోడి కంటే ముందే తలుపు తట్టేది వలంటీర్. అవ్వా నీ పింఛను డబ్బులు ఇవిగో..అంటూ...బాబూ నా రేషన్ కార్డుతో సరుకులు రావడం లేదు చూడు నాయనా అంటే అమ్మా నువ్వేం కంగారు పడకు నేను చేయిస్తా అంటూ భరోసా ఇచ్చేది వలంటీర్. బాబూ నా ఆరోగ్యం బాగోక వైజాగ్‌లోని పలానా ఆస్పత్రిలో ఉన్నా అనగానే సరే నేను అక్కడికొచ్చి మీ పింఛను డబ్బులు ఇస్తా కంగారు పడకండి అంటూ ధైర్యాన్ని కల్పిస్తూ..ఊళ్లు దాటి జిల్లాలు దాటి లబ్ధిదారుడి చెంతకు సంక్షేమ పథకాలను చేర్చే నిస్వార్థ సేవా గుణం వలంటీర్లది. తమ పరిధిలోని 50 కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా ధ్రువ పత్రాలు అందించడంలోనూ వలంటీర్లు విశేష కృషి చేస్తున్నారు. కోటవురట్ల మండలంలోని 19 గ్రామ సచివాలయాల పరిధిలో 342 మంది వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. ఎవరో ఏవో నిందలు వేశారని కించిత్ నిరాశ చెందకుండా తమ ఉత్తమ సేవలను అందిస్తూ ముందుకు సాగుతున్నారు. వారి సేవలకు జనం జేజేలు పలుకుతున్నారు.

ఒకటో తేదీనే పింఛను తెచ్చిస్తున్నాడు



వలంటీరు రాజా బాబు నా పింఛను డబ్బులు ఒకటో తేదీనే తెల్లవారక ముందే తెచ్చి ఇచ్చేస్తాడు. ఆ వలంటీర్లు ఉన్నారు కాబట్టి నాలాంటోళ్లు పంచాయతీ ఆఫీసుకు వెళ్లాల్సిన పనిలేకుండా పోయింది. పింఛను డబ్బులు గురించి బెంగ పెట్టుకోవలసిన పనిలేదు.

– ఉప్పు వీరతల్లి, కోటవురట్ల

వలంటీరు బాబు అంటే భరోసా



వలంటీరు సాంబశివ బాబు ఉన్నాడు కాబట్టే నేను ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. ఆ బాబు ఒకటో తేదీనే పింఛను డబ్బులు తెచ్చి ఇచ్చేస్తాడు. నా రేషన్ కార్డులో సరుకులు రాకపోయినా వలంటీర్లే సరి చేసి తిరిగి సరుకులు వచ్చేలా చేశారు. ఇదివరకైతే కోటవురట్ల ఆఫీసుకు వెళ్లి రోజుల తరబడి వాళ్లని బతిమాలు కోవలసివచ్చేది.

– బండి రాము, కె.వెంకటాపురం

నిశ్చింతగా ఉంది..



పింఛను డబ్బులు కోసం పంచాయతీ ఆఫీసుకెళ్లి గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సిన పని ఇపుడు లేదు. నిశ్చింతగా ఇంటి దగ్గర ఉంటే చాలు వలంటీరు తెచ్చి ఇచ్చేస్తున్నాడు. ఇది వరకైతే చాలా ఇబ్బంది పడేవాళ్లం. సర్టిఫికెట్లు సమస్య వచ్చినా వలంటీర్లు పరిష్కరిస్తున్నారు.

– నూకరాజు, రాట్నాలపాలెం

ఆ అమ్మే మాకు ధైర్యం..



జగన్‌బాబు మాలాంటోళ్ల గురించి ఆలోచించి వలంటీర్లను పెట్టారు. మా వలంటీరు రామ సత్యవతమ్మ నా బిడ్డలా చూసుకుంటాది. ఒకటో తారీఖునే పొద్దున్నే వచ్చి అవ్వా నీ పింఛను డబ్బులు తీసుకో అని ఎంతో బాగా పలకరిత్తాది. ఆ అమ్మ వచ్చిందంటే ఎంతో ధైర్యంగా ఉంటాది.

– పైల చెల్లయమ్మ, కె.వెంకటాపురం

జనాభా నియంత్రణ పాటించాలి



సైతారుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



మునగపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం : జనాభా నియంత్రణ దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలని పెనుగొల్లు, సర్వసిద్ధి పీహెచ్‌సీల వైద్యాధికారులు రాజేశ్వరి, వాసంతి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని పెనుగొల్లు, సైతారుపేట గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించి నినాదాలు చేయించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ యుక్త వయస్సు వచ్చే వరకు వివాహాలు చేయరాదన్నారు. వివాహితులు బిడ్డకు బిడ్డకు విధిగా ఎడం పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మునగపాకలో ర్యాలీ

మునగపాక: అధిక జనాభా కారణంగా దేశాభివృద్ధి కుంటుపడుతుందని వైద్యాధికారి నంది విమలగిరి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న కుటుంబం చింతలేని కుటుంబమన్నారు. జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఉమామహేష్, ఎంఎల్‌హెచ్‌పీలు వినీత, మౌనిక, భవాని, ఏఎన్ఎంలు దేవకి,రేవతి, వైద్య సిబ్బంది జగన్నాథరావు, కుమారి పాల్గొన్నారు.

అధిక జనాభాతో ముప్పు



హరిపాలెం పీహెచ్‌సీ వద్ద ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అచ్యుతాపురం (అనకాపల్లి): అధిక జనాభా వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ హరిపాలెం పీహెచ్‌సీ వద్ద మంగళవారం ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి రజనీ ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సరిపడా వనరులు పెరగవని, తద్వారా దేశాభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. ఒకరు ముద్దు, ఇద్దరు వద్దని నినాదాలు చేశారు. నిబంధనల మేరకు పెళ్లి వయస్సు వచ్చిన తర్వాతే వివాహం చేసుకోవాలని, అర్హులైన దంపతులు కుటుంబ సంక్షేమ ఆపరేషన్లు చేయించుకోవాలని సూచించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది రామలక్ష్మి, విష్ణుకుమారి, సునీత, గణేశ్, ఇందిరా భవానీ, ముకేశ్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

నక్కపల్లి: త్వరలో మండల కేంద్రంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎఫ్‌యుఐడీసీ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, సర్పంచ్ నేతల రత్నకుమారి కోరారు. మంగళవారం వలంటీర్లతో కలిసి నక్కపల్లిలో ఇంటింట సర్వే ప్రారంభించారు. ప్రజలకు అవసరమైన కుల, ఆదాయ, నివాస, జనన, మరణ ధ్రువపత్రాలు, వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు, మ్యూటేషన్ దరఖాస్తులు స్వీకరించి, గ్రామసభలో అర్హులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వీసం తదితరులు

కాగా చినదొడ్డిగల్లు సచివాలయంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేని ఎంపీడీవో సీతారామరాజు మంగళవారం పరిశీలించారు. వైస్ ఎంపీపీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష

ఎస్.రాయవరం : మండలంలో బుధవారం ఉప్పరాపల్లి, కొత్త రేవు పోలవరం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. ఉప్పరాపల్లి గ్రామంలో తహసీల్దార్ బృందం, కె.పోలవరం గ్రామంలో ఎంపీడీవో బృందం అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించే క్రమంలో కేటాయించిన సిబ్బంది సకాలంలో హాజరై వినియోగదారులకు సర్వీసులు అందివ్వాలన్నారు.

కోటవురట్ల : మండలంలోని కొడవటిపూడి, బి.కె.పల్లి గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. కొడవటిపూడిలో తహసీల్దారు జానకమ్మ బృందం, బి.కె.పల్లిలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు బృందం కార్యక్రమం నిర్వహిస్తారని, లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని తెలిపారు.

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి. నాగవరం సచివాలయాల్లో బుదవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు వాడ్రాపల్లి,4 సాయంత్రం 4 గంటలకు నాగవరం గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు హాజరై అర్హులకు ధ్రువపత్రాలు అందజేస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని అచ్చియ్యనాయుడు కోరారు.

రాంబిల్లి: లాలంకోడూరు, జెడ్. చింతువ సచివాలయాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే రమణమూర్తి రాజు(కన్నబాబు) ఈ కార్యక్రమాలకు హాజరవుతారని, ప్రజలు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కొండలరావు కోరారు.

ఘనంగా ఎమ్మెల్యే కన్నబాబురాజు జన్మదిన వేడుకలు



ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గోవింద్, పార్టీ నాయకులు



వికలాంగుల ఆశ్రమ నిర్వాహకుడు పట్నాయక్‌కు రూ.10వేలు నగదుని అందజేస్తున్న నాయకులు

యలమంచిలి/రాంబిల్లి/అచ్యుతాపురం (అనకాపల్లి) : ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) 72 వ జన్మదిన వేడుకలు నియోజకవర్గంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఎంపీపీ బోదెపు గోవింద్ , పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలసి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. యలమంచిలి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ కర్రి శివ, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్త, బెజవాడ నాగేశ్వరావు, కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు, మండల రూరల్ వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు త్రినాథ్, కౌన్సిలర్లు గొర్లె వెంకట్, షేక్ సయ్యద్ బేబి, దాసరి కుమార్, గంధం శివ పాల్గొన్నారు. ఏటికొప్పాకలో ఆంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సేనాపతి రాము ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేసి గ్రామంలో మిఠాయిలు పంచారు. పార్టీ కార్యకర్తలు వీసం వాసు కరణం రవి, దిమిలి రమణబాబు, ప్రతాప్‌బాబు, బంగారుబాబు, అచ్చియ్యనాయుడు, నాగబాబు, దేవరపల్లి కుమారి పాల్గొన్నారు. రాంబిల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. జెడ్పీటీసీ నాగరాజు, ఎంపీపీ జి.శిరీష శ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కిషోర్, సచివాలయ కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు. ఎమ్మెల్యే జన్మదినం పురస్కరించుకుని అచ్యుతాపురం మండల వైస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. జెడ్పీటీసీ లాలం రాంబాబు, ఎంపీపీ భర్త కోన బుజ్జి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు శంకర్‌రావు సమక్షంలో కేక్ కట్ చేశారు. అదేవిధంగా ఇంటిగ్రేటెడ్ వికలాంగుల ఆశ్రమంలో పిల్లల సమక్షంలో కేక్ కట్ చేశారు. పిల్లలకు బిస్కట్లు, ఫ్రూటీలు పంపిణీ చేశారు. ఆశ్రమంలో పిల్లల భోజనాల నిమిత్తం పదివేల రూపాయల నగదుని అందజేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ,పార్టీ అధికార ప్రతినిధి పిన్నంరాజు వాసు, కో–ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, చేపల వెంకట రమణ, జువ్వాలనాయుడు పాల్గొన్నారు.

ఎంఈవోకు ఏపీటీఎఫ్ నేతల వినతి



ఎంఈవో వేణుగోపాలరావుకు వినతి అందజేస్తున్న ఉపాధ్యాయులు

మునగపాక : ఏపీటీఎఫ్ ఉద్యమ నేత వెంకటపతిరాజు నేతృత్వంలో ఉపాధ్యాయులు మంగళవారం ఎంఈవో వేణుగోపాలరావును కలిసారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరుతూ ఏపీటీఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యనారాయణ, సన్యాసినాయుడు తదితరులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాము, గౌరవ అధ్యక్షుడు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు బియ్యం పంపిణీ



నాగులాపల్లిలో పారిశుధ్య కార్మికులకు బియ్యం బస్తాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మునగపాక: నాగులాపల్లి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు మంగళవారం బియ్యం బస్తాలు అందజేశారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు బియ్యం అందజేశారు. సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు జామి రాజు(సింగర్‌రాజు)మాట్లాడుతూ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సహకారంతో నాగులాపల్లి అభివృద్ధి చెందుతుందన్నారు. వైస్ ఎంపీపీ దేవి, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా సత్యనారాయణ, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ యంత్రాంగం



సంక్షేమ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటుందని, ప్రతి ఒక్కరి సమస్య పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. అరట్లకోట గ్రామంలో గడప గడపకు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైనవారందరికీ పింఛన్లు, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, రైతు భరోసా, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, రైతులకు రాయితీలపై విత్తనాల సరఫరా, ధాన్యం కొనుగోలు, వ్యవసాయానికి పనిముట్లు అందిస్తుందన్నారు. గ్రామాల్లో ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గ్రామ వలంటీర్ల వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలు ఇంతవరకు అందని వారికి చిన్న చిన్న సమస్యలుంటే తొలగించి, వారందరికీ పథకాలు అందించడమే ధ్యేయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి, పథకాలు అమలు తీరు లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కొంత మందికి ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదని ఫిర్యాదు చేయడంతో అర్హులందరికీ ఇళ్ల స్థలాల కేటాయింపు జరుగుతుందని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలు ముద్రించిన బ్రోచర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, పాయకరావుపేట పీఏసీఎస్ అధ్యక్షుడు రాజేష్ ఖన్నా, సర్పంచ్ అప్పలనర్స పాల్గొన్నారు.

5వ రోజుకు రిలే నిరాహార దీక్ష



కొబ్బరి మట్టలు, ఆకులు ధరించి వినూత్నంగా నిరసన తెలుపుతున్న గిరిజనులు

కోటవురట్ల: అణుకు గిరిజనుల రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది. సోమవారం వారి దీక్ష ఐదో రోజుకు చేరగా వినూత్నంగా నిరసన తెలిపారు. కొబ్బరి మట్టలు, ఆకులు ఒంటికి చుట్టుకుని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అణుకు గిరిజనులు ఎన్నో సమస్యలతో జీవనం సాగిస్తున్నారన్నారు. స్థానికంగా పాఠశాల లేకపోవడంతో చిన్నారులు బడికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని ఈ ప్రభుత్వంలో అయినా న్యాయం చేయాలని కోరారు. గ్రామానికి రోడ్డు, బడి నిర్మించి చిన్నారులకు భవిష్యత్‌ను అందించాలని కోరారు. అధికారులు స్పందించేంత వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు జి.డేవిడ్‌రాజ్, గిరిజనులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



వరి విత్తనాలు అందజేస్తున్న కోన బుజ్జి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పెదపాడు, జగ్గన్నపేట రైతు భరోసా కేంద్రాల వద్ద మంగళవారం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అవసరమైన వరి విత్తనాల్ని ఎంపీపీ భర్త కోన బుజ్జి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బీ.శంకర్ గోవింద్ మాట్లాడుతూ ఖరీఫ్‌కు సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, విత్తనాలు నాటేటప్పుడు విత్తన శుద్ధి చేయాలని సూచించారు. వ్యవసాయ విస్తరణాధికారి కె.సూర్యనారాయణ, వీఏఏ నీరజ, సర్పంచ్‌లు జనపరెడ్డి అరుణ్ రమేష్, రైతులు పాల్గొన్నారు.